RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:8 26-6-2025 గురువారం ఎడిటర్ :మర్రి పవీన్ పేజీలు : 8 వెల 4 /-

## కేంద్ర కేబినెట్‌లో చంద్రబాబు, లోకేష్‌ను మెచ్చుకున్న ప్రధాని




న్యూఢిల్లీ,(టుడే విదుర, జూన్ 25): ఏపీలో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్రపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల జల్లు కురిపించారు. ఈరోజు (బుధవారం) జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో యోగాంధ్ర ప్రస్తావనకు వచ్చింది. యోగాంధ్ర విజయవంతంమైందని కేబినెట్‌లో ప్రధాని ప్రశంసించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు , మంత్రి లోకేష్ యోగాంధ్రను విజయవంతం చేశారని తెలిపారు. యోగాంధ్రను విజయవంతం చేసినందుకు చంద్రబాబు, లోకేష్‌లను కేబినెట్ మంత్రుల ముందు మెచ్చుకున్నారు ప్రధాని. యోగాంధ్ర కార్యక్రమం ఊహించని విధంగా జరిగిందన్నారు. ఇప్పటి వరకూ తాను ఎన్నో కార్యక్రమాలను చూశానని... కానీ యోగాంధ్రలాంటి అతి భారీ కార్యక్రమాన్ని చూడలేదన్నారు.యోగాంధ్రను ప్రెస్టేజ్‌గా తీసుకుని చంద్రబాబు, లోకేష్ చేయడం నిజంగా అభినందనీయమని కొనియాడారు. ఏపీలో నెల రోజుల పాటు యోగాంధ్రను నిర్వహించడం అన్నది మర్చిపోలేని విషయమన్నారు. అసలు 30 రోజుల పాటు సమాజంలోని అన్ని వర్గాల వారిని కలిపి యోగాంధ్రను ఎలా చేశారో నివేదిక ఇవ్వాలని ఏపీని కోరినట్లు కేబినెట్ సమావేశంలో మోదీ తెలిపారు. ఏపీ నుంచి యోగాంధ్రపై నివేదిక వచ్చిన తరువాత దాన్ని అన్ని రాష్ట్రాలకు పంపనున్నట్లు చెప్పారు. ఒక మంచి కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలో చంద్రబాబు, లోకేష్‌ను చూసి మిగతా వారంతా నేర్చుకోవాలని సూచించారు. యోగాంధ్ర విజయాన్ని అందరూ స్టడీ చేయాలని కేంద్ర మంత్రులకు తెలియజేశారు. యోగాంధ్రకు రెండు గిన్నిస్ రికార్డులతో పాటు పలు రికార్డులు రావడం కూడా సంతోషంగా ఉ ందని కేబినెట్ సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పుకొచ్చారు.

## ఇది చారిత్రాత్మక ప్రయాణం..

## శుభాంశు శుక్లాకు లోకేష్ అభినందనలు



అమరావతి, (టుడే విదుర, జూన్ 25): భారత వ్యోమగామి శుభాంశు శుక్లా యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి వెళ్లారు. దాంతో దాదాపు 41 ఏళ్ల తర్వాత అంతరిక్షంలో అడుగుపెట్టిన తొలి భారత వ్యోమగామిగా ఆయన చరిత్రలో నిలిచారు. శుభాంశు శుక్లాతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి బయలుదేరి వెళ్లారు. దీనిపై మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా శుభాంష్ శుక్లా, అతని బృందానికి అభినందనలు తెలియజేశారు. ఈ ప్రయాణం ఎదురులేని భారత ఆత్మకు నిదర్శనంగా నిలుస్తుందంటూ మంత్రి ట్వీట్ చేశారు.గ్రూప్ కెప్టెన్ శుభాంశ్ శుక్లా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నుంచి మొదటి ఇస్రో అంతరిక్ష యాత్రికుడిగా రికార్డు సృష్టించారు. యాక్సియం-4 అంతర్జాతీయ అంతరిక్ష స్పెస్ స్టేషన్‌లో దిగడం గర్వకారణం. ఇది చారిత్రాత్మక ప్రయాణంగా నిలిచిపోతుంది. శుభాంశ్ శుక్లా ప్రయత్నం భారత అంతరిక్ష రంగంపైనే కాదు... ప్రపంచ అంతరిక్ష యాత్రలలో తనదైన ముద్ర వేస్తుంది. శుభాంశ్ శుక్లాకు అతని టీమ్‌కు అభినందనలు. ఈ అంతరిక్ష ప్రయాణం, ధైర్యం, ముందుచూపు, ఎదురులేని నూతన భారత ఆత్మకు నిదర్శనంగా నిలుస్తుంది' అంటూ ట్వీట్ చేస్తూ.. ఇస్రోకు, నాసాకు, స్పేస్ ఎక్స్‌కు యాక్సియం-4, ఇండియన్ ఎయిర్ ఫోర్స్, స్పేస్ ఒడిస్సికి ట్యాగ్ చేశారు మంత్రి లోకేష్. అలాగే శుభాంశ్ శుక్లా ప్రయాణించిన అంతరిక్ష వాహనంతో కూడిన ఫోటోను కూడా మంత్రి లోకేష్ ఎక్స్‌లో షేర్ చేశారు.

## హైదరాబాద్ బ్రౌన్ ఫీల్డ్ సిటీ..

# అమరావతి గ్రీన్ ఫీల్డ్ సిటీ : చంద్రబాబు




విజయవాడ (టుడే విదుర, జూన్ 25): హైదరాబాద్ బ్రౌన్ ఫిల్డ్ సిటీ.. అమరావతి గ్రీన్ ఫీల్డ్ సిటీ అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఇవాళ విజయవాడలో భారత వాణిజ్య పరిశ్రమల సమాఖ్య నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా తాను టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నానని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు సీఎంగా ఉన్న నాడే హైటెక్ సిటీకీ మైక్రోసాఫ్ట్ సహా అనేక అంతర్జాతీయ సంస్థలు వచ్చాయని గుర్తు చేశారు. ఇప్పుడు అన్ని దేశాల్లో యువత సమస్య ఉందని పేర్కొన్నారు.ఊహించని విధంగా టెక్నాలజీలో మార్పులు వచ్చాయని తెలిపాడు. ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్రెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. కాంపిటీటివ్ ఎకానమీతో మనం ముందుకు వెళ్తున్నామని.. ప్రధాన నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశ ఆర్థిక వ్యవస్థ దూసుకెళ్తోందని అన్నారు. రాబోయే రోజుల్లో ఎవరూ ఊహించని విధంగా అద్భుత నగరంగా అమరావతి మారబోతోందని.. టెక్నాలజీని విరివిగా ఉపయోగిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ సేవలన్నీ వాట్సాప్ ద్వారాలో అందిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## సీఎం చంద్రబాబుపై బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ ప్రశంసలు



అమరావతి, (టుడే విదుర, జూన్ 25): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంచి విజన్ ఉన్న నాయకుడని బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ సారథ్యంలోని ప్రతినిధి బృందం ప్రశంసించింది. రాజధాని అమరావతి అభివృద్ధి కోసం ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేస్తామని మంత్రి నారాయణకు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ఓవెన్ తెలిపారు. ఇటీవల అమరావతిలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన బాగా జరిగిందని డిప్యూటీ హై కమిషనర్ గుర్తు చేశారు.బుధవారం రాజధాని అమరావతిలో మంత్రి నారాయణతో బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్‌తో కూడిన ప్రతినిధి బృందం మర్యాద పూర్వకంగా సమావేశమైంది. ఈ సందర్భంగా రాజధాని అమరావతి ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధిని ఆ బృందానికి మంత్రి పి. నారాయణ సోదాహరణగా వివరించారు. రాజధాని అమరావతి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని ఈ సందర్భంగా వారికి పి. నారాయణ తెలిపారు.అమరావతిలోని స్థానిక ఐకానిక్ భవనాల డిజైన్లు యూకేకు చెందిన నార్మన్ ఫాస్టర్ రూపొందించారని ఆ బృందానికి వివరించారు. ప్రదానంగా రాజధాని నిర్మాణాల్లో డిజైన్, ఇంజనీరింగ్ సేవల్లో ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ఆసక్తి ఉందని ఉందని యూకే ఇన్‌ఫ్రాస్టెక్చర్ ఎక్స్‌పోర్ట్ గ్రూప్ చైర్ పర్సన్ పర్వీస్ వెల్లడించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్‌తోపాటు వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మరో వైపు తెలుగు రాష్ట్రాల్లో బ్రిటన్ ప్రభుత్వ వ్యవహారాలను డిప్యూటీ హై కమిషనర్ పర్యవేక్షిస్తున్న విషయం విదితమే.

## ఆ సమస్య అన్ని దేశాల్లో ఉంది



విజయవాడ,(టుడే విదుర, జూన్ 25): మొదట్లో బిజినెస్ పీపుల్‌తో రాజకీయ నాయకులు మాట్లాడే వారు కాదని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్తామంటే వెళ్లొదని.. అలా వెళ్లడం వల్ల ప్రజల్లో ఒక భావన ఏర్పడుతుందని వారు సూచించే వారని ఆయన పేర్కొన్నారు. అయినా తాను పలుమార్లు దావోస్‌కు వెళ్లానని.. పారిశ్రామికవేత్తతో మాట్లాడి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించానని చెప్పారు. బుధవారం విజయవాడ నగరంలో ఫిక్కీ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. నాటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రపంచీకరణ కు అనుమతి ఇవ్వడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ చక్కబడిందన్నారు. గత ప్రధాని పీవీ నరసింహారావు కంపల్షన్ వల్ల అలా చేశారని చెబుతున్నప్పటికీ.. దీని వల్ల దేశానికి మేలు జరిగిందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మనం క్వాంటమ్ కంప్యూటర్ గురించి మాట్లాడుతున్నామన్నారు. ఫిక్కీ 100 ఏళ్లకుపైగా ఉన్న సంస్థ అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ బ్రౌన్ ఫీల్డ్ సిటీ అని.. రాజధాని అమరావతి గ్రీన్ ఫీల్డ్ సిటీ అని అభివర్ణించారు. రాజధాని అమరావతి అద్భుత నగరంగా మారబోతోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.పాలనలో టెక్నాలజీని విరివిగా వినియోగిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆ క్రమంలో ప్రభుత్వ సేవలన్నీ వాట్సాప్‌లో అందిస్తున్నామని వివరించారు. మూడు దశాబ్దాలుగా టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. హైటెక్ సిటీకి మైక్రోసాఫ్ట్ సహా పలు పెద్ద కంపెనీలు వచ్చాయని గుర్తు చేశారు. ప్రస్తుతం అన్ని దేశాల్లో యువత సమస్య ఉందన్నారు. ఊహించని విధంగా టెక్నాలజీలో మార్పులు వస్తున్నాయని చెప్పారు. క్వాంటమ్ వ్యాలీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉన్న అంశాలని ఆయన సోదాహరణగా వివరించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో అద్భుతాలు జరుగుతాయని సీఎం చంద్రబాబు తెలిపారు కాంపిటేటివ్ ఎకానమీలో మనం ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోందని సీఎం చంద్రబాబు వివరించారు.అంతకు ముందు ఈ సమావేశానికి హాజరైన సీఎం చంద్రబాబుకు ఫిక్కీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఫిక్కీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు.. అమలు చేస్తున్న పాలసీలు ఇండస్ట్రీ ఫ్రెండ్లీగా ఉంటున్నాయని ప్రశంసించారు. ఎంఎస్ఎంఈ ల విషయంలో చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం తీసుకుంటున్న చొరవను ఈ సందర్భంగా వారు అభినందించారు.

# 'ఉచిత ప్రయాణం' కోసం 2 వేల బస్సులు కొనాలి

## 10 వేల మంది సిబ్బందిని నియమించాలి: ఈయూ




విజయవాడ (టుడే విదుర, జూన్ 25): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణ పథకం విజయవంతం కావాలంటే 2వేల బస్సులు కొనుగోలు చేయాలని, 10 వేల మంది సిబ్బందిని నియమించాలని ఏపీఎసఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పలిశెట్టి దామోదరావు అన్నారు. మంగళవారం విజయవాడలోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

# 270 డిగ్రీ కాలేజీలపై వేటు

## 25 శాతం అడ్మిషన్లూ లేని కళాశాలలకు ఉన్నత విద్యామండలి నోటీసులు–

అమరావతి, (టుడే విదుర, జూన్ 25): కనీస స్థాయిలో అడ్మిషన్లు లేని ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు ఉన్నత విద్యామండలి నోటీసులు జారీచేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,200 ప్రైవేటు డిగ్రీ కాలేజీలుండగా.. 270 కాలేజీల్లో 25 శాతం కంటే తక్కువ అడ్మిషన్లు నమోదవుతున్నాయి. అందులో రెండు కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా రావట్లేదు. దీంతో ఈ కాలేజీలకు అడ్మిషన్లు ఎందుకు కొనసాగించాలో చెప్పాలని ఉన్నత విద్యామండలి వివరణ కోరుతోంది. కాలేజీల నుంచి వివరణ తీసుకోవడానికి ఉన్నత విద్యామండలి ఓ కమిటీని ఏర్పాటు చేస్తోంది. కాలేజీల యాజమాన్యాలు ఆ కమిటీ ముందు వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. వివరణపై కమిటీ సంతృప్తి చెందితే అనుమతులు కొనసాగిస్తారు. లేనిపక్షంలో ఆ కాలేజీలకు అనుమతులు నిలిపివేస్తారు.



కాగా, గత ప్రభుత్వంలోనూ పలు కాలేజీలకు అనుమతులు ఆపేయగా, న్యాయస్థానం అనుమతితో కాలేజీలను కొనసాగించారు. ఇప్పుడైనా కఠిన చర్యలు తీసుకుంటారా? అనేది చూడాలి.

# నలుగురు నిందితులు పోలీసు కస్టడీకి

## ఒకరి ఇంట్లో డీఎస్పీ ఆధ్వర్యంలో సోదాలు

ఒంగోలు (టుడే విదుర, జూన్ 25): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన వీరయ్య చౌదరి హత్య కేసులో నలుగురు నిందితులను పోలీసులు కస్టడీకి తీసుకొని విచారిస్తున్నారు. ప్రధాన పాత్రధారి బోర్లుగుంట వినోద్ కుమార్, ఆళ్ల సాంబశివరావు, గోళ్ల రూ త్వేంద్రబాబు, ఓబిలి నాగరాజులను మంగళవారం ఉదయం 10.30కి జిల్లా జైలు నుంచి పోలీసు కస్టడీకి తీసుకొని వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. అనంతరం వారిని ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈనెల 27 సాయంత్రం వరకు న్యాయవాది సమక్షంలో పోలీసులు విచారించనున్నారు. ఒంగోలులో ఉన్న నిందితుడు వినోద్ ఇంట్లో డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు.

# కార్మికుల తొలగింపుపై నిరసన

## పరిశ్రమ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు



రణస్థలం,(టుడే విదుర, జూన్ 25): పైడిభీమవరం పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేట్ కెమికల్ పరిశ్రమలో పనిచేస్తున్న 11 మంది కార్మికులను తొలగించడంపై ఆ పరిశ్రమ లో పనిచేస్తున్న కార్మికులంతా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలు వురు కార్మికులు మాట్లాడుతూ.. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొల గించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నఫలంగా తీసేయడంతో తామంతా వీధినపడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమని ప్రశ్నిస్తే పరిశ్రమ నష్టాల్లో ఉందని యాజమాన్యం చెబుతుందన్నారు. ఈ విషయమైన పరిశ్రమ యజమాని బి.లక్ష్మణ రావు మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల వల్ల పరిశ్రమ నష్టాల్లో ఉందని, అందువల్ల ఏడుగురు కార్మికులను తొలంచినట్టు తెలిపారు. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ అజయ్ కార్తికేయ్‌ను వివరణ కోరగా.. అక్కడి పరిస్థితి పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. యాజమాన్యాలు కార్మిక చట్టాలు కచ్చితంగా అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. కాగా ఐదేళ్ల కిందట ఏర్పాటైన ఈ పరిశ్రమలో 70 మంది వరకు ఉపాధి పొందుతున్నారు.

# -బాబోయ్ ట్రాఫిక్

## ఎల్‌సీ గేట్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

## ఎల్‌సీ గేట్ వద్ద వాహనాల బారులు

## రైల్వే సిబ్బంది నిర్లక్ష్యం వల్లే అంటున్న వాహనచోదకులు



ఇచ్ఛాపురం, (టుడే విదుర, జూన్ 25): ఇచ్ఛాపురం రైల్వే ఉత్తర కేబిన్ ఎల్‌సీ గేట్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే గేట్ వేశారంటే అరగంట ఆగాల్సిందే. రైలు రా కుండానే అరగంట ముందే గేట్ వేయడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందని వాహనచోదకులు మం డిపడుతున్నారు. మంగళవారం ఎల్‌సీ గేటు వేసి సుమారుగా 40 నిమిషాల పాటు తీయకపోవడంతో వాహనాలు బారులుతీరాయి. దీంతో పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేయాల్సి వచ్చింది. సుమారు గా అర కిలోమీటర్ల వరకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. గేటు చాలా సమయం తీయకపోవడంతో స్కూల్స్‌కి, కళాశా లలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. కొంతమంది విద్యార్థులు సైకిళ్లను ఎత్తుకుని రైల్వే ట్రాక్ దాటారు. ఈ సమయంలో ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు ఇప్పటికైనా రైల్లే అధికారులు సందించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

# మహిళలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

## కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు



శ్రీకాకుళం (టుడే విదుర, జూన్ 25): మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పాస్టర్ షాలెంరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ మహిళా విభాగం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పాస్టర్ షాలెంరాజు మల్లెపూలు పెట్టుకున్న స్త్రీలు బజారు స్త్రీలంటూ చేసిన వ్యాఖ్యలు హిందూ సమాజంలోని స్త్రీలందరినీ అవమానించడమేనని అన్నారు. సనాతన హిందూ సంప్రదాయంలో స్త్రీలకు అతి పవిత్రమైన పంచ మాంగల్యాలు అయిన పసుపు, కుంకుమ, మాంగల్యం, గాజులు, పువ్వులు ధరించడంపై నీచంగా, హేళనగా మాట్లాడడం క్షమించరాని విషయమని మండిపడ్డారు. అనంతరం వారు డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా మాతృమండలి ప్రముఖ్ వారణాశి, సంతోషి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శవ్వాన ఉమామహేశ్వరి, పి.ఢిల్లేశ్వరి, టి.రజని, జయలక్ష్మి, పి.శ్యామల, సీహెచ్ సరోజిని, ఆర్.చంద్రమ్మ, పి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# హత్యకేసులో నిందితుడి అరెస్టు

## వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు




ఇచ్ఛాపురం, (టుడే విదుర, జూన్ 25): క్షణికావేశంలో మామ గంగయ్యను హత్యచేసిన కేసులో నిందితుడు అల్లుడు పాతిర్ల దశరథను లొద్దపుట్టి వద్ద పట్టుకున్నట్టు ఇచ్ఛాపురం సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ స్థానిక పోలీసు స్టేషన్‌లో వెల్లడించారు. ఈనెల 16వ తేదీన మండపల్లిలో బైక్ విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో మామపై కోపం పెంచుకున్న దశరథ చంపేశాడు. నిందితుడ్ని అరెస్టు చేసి ఇచ్ఛాపురం కోర్టులో హాజరుపరచినట్టు సీఐ తెలిపారు.

# గోదాములున్నా.. ప్రయోజనమేదీ?

- ♦ నరసన్నపేట మార్కెట్ కమిటీ కార్యాలయం
- ♦ సక్రమంగా అమలుకాని రైతుబంధు పథకం
- ♦ నిరుపయోగంగా మార్కెట్ యార్డులు
- ♦ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై రైతుల ఆశలు



నరసన్నపేట, (టుడే విదుర, జూన్ 25): రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం లక్ష్యం నీరుగారుతోంది. జిల్లాలో 12 వ్యవసాయ మార్కెట్ యార్డు(ఏఎంసీ)ల పరిధిలో గోదాములు ఉన్నా.. ప్రయోజనం లేకపోతోంది. రైతులు పండించిన పంటకు మద్దతు ధర లభించేవరకూ గోదాముల్లో నిల్వ ఉంచుకోవచ్చు. గోదాములో నిల్వ ఉంచిన పంట విలువలో 75 శాతం డబ్బులను రైతులు రైతుబంధు పథకం ద్వారా రుణంగా తీసుకోవచ్చు. గరిష్ఠంగా రూ.లక్ష వరకూ రుణం పొందవచ్చు. మొదటి 3 నెలలు కాలానికి వడ్డీ వర్తించదు. ఆ తరువాత 5వేలకు 5శాతం, 10వేలకు 6శాతం, 15వేలకు 8శాతం, 50వేలు లోపు 10శాతం చొప్పున వడ్డీ చెల్లించాలి. కానీ జిల్లాలో మార్కెట్ కమిటీ పరిధిలో ఈ పథకం నామమాత్రంగా సాగుతోంది. కొన్ని మార్కెట్ యార్డుల్లో గత పాలకులు బినామీ పేర్లతో రుణాలు పొందినట్టు తెలుస్తోంది. అలాగే అవగాహన లేక ఈ గోదాముల్లో రైతులెవరూ పంటను నిల్వ చేసుకోని దుస్థితి నెలకొంది.జిల్లాలో నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస, పొందూరు, కోటబొమ్మాళి, పాతపట్నం, హిరమండలం, ఇచ్ఛాపురం, కంచిలి, పలాస, జలుమూరు, ఎచ్చెర్లలో వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. 11 మార్కెట్ యార్డుల గోదాములు ఉన్నాయి. కొన్ని యార్డుల్లో గోదాములు నిరూపయోగంగా.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. జలుమూరు మార్కెట్ కమిటీకి సంబంధించి భవనాలను నిర్మించాల్సి ఉంది. కాగా.. పంటలను మార్కెట్ యార్డుల్లో నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉన్నా.. అధికారులు అవగాహన కల్పించడం లేదు. దీంతో దళారీలు ఇచ్చిన ధరకు రైతులు పంటలను అమ్ముకోవాల్సిన దుస్థితి వచ్చింది. ఇటీవల రబీలో మొక్కజొన్న పంటకు మొక్కజొన్న ఇవ్వకుండా వ్యాపారులు సిండికేట్‌గా మారారు. దీంతో రైతులు తక్కువ ధరకు పంటను విక్రయించుకోవాల్సి వచ్చింది. అలాగే వరిలో సన్నరకాలకు కూడా దళారీలు తక్కువ ధరకే కొనుగోలు చేశారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మార్కెట్ యార్డుల చైర్మన్లను నియమించిన విషయం తెలిసిందే. వారికి పదవీ బాధ్యతలు అప్పగించడంలో జాప్యమవుతోంది. వారు బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎమ్మెల్యేల సహకారంతో వ్యవసాయ మార్కెట్ యార్డులను అభివృద్ధికి కృషి చేస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మాస్‌కాపీయింగ్‌కు ఒప్పుకోలేదని వీరంగం

## నివ్వెరపోయిన ఇన్విజిలేటర్, ప్రిన్సిపాల్
## కనిగిరి డిగ్రీ కాలేజిలోని పరీక్షా కేంద్రంలో ఘటన

కనిగిరి,(టుడే విదుర, జూన్ 25): అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షల్లో మాస్ కాపియింగ్‌కు ఒప్పుకోలేదని ఓ ప్రభుత్వ మహిళా ఉపాధ్యాయిని (ఎస్జీటీ) దురుసుగా ప్రవర్తించారు. ఈఘటన మంగళవారం కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో చోటుచేసుకుంది. ఈనెల 20వ తేదీ నుంచి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలు జరుగుతున్నాయి. కనిగిరి ప్రభుత్వ కళాశాల కేంద్రంలో దాదాపు 125 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. జరిగిన పరీక్షల్లో ఓ ఉపాధ్యాయిని పరీక్ష జరిగే సబ్జెక్ట్‌ను కేంద్రంలోపలకు తెచ్చుకుని జవాబులు రాస్తున్నారు. దీనిని అడ్డుకున్న ఇన్విజిలేటర్‌పై, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషారాణిపై దురుసుగా ప్రవర్తించారు. పరీక్షా కేంద్రం వద్దకు తమ బంధువులను పిలిపించి నానారభస చేశారు. పరీక్షల నిర్వహణకు ఆటంకం కల్గించటం బాధాకరంగా ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉషారాణి ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమిటని ప్రశ్నించినందుకు మహిళా ఉపాధ్యాయిని దురుసుగా ప్రవర్తించారని కన్నీటి పర్యంతమయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి ఆ మహిళా ఉపాధ్యాయినిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఓ మహిళా ప్రభుత్వ ఉపాధ్యాయిని అయి ఉండి మాస్ కాపీయింగ్‌ను సమర్థించకుండా అడ్డుకున్నందుకు దుర్భాషలాడటమే కాకుండా పరీక్షా కేంద్రం వద్దకు బంధువులను పిలిపించి వీరంగం చేశారు. పరీక్ష రాసేవారికి ఇబ్బంది కల్గుతుంది, కేకలు వేయవద్దు బయటికి రమ్మని పిలిచినా వినలేదు. ఓ ఉపాధ్యాయిని ఇలా ప్రవర్తించటం సిగ్గుగా ఉంది. ఇలాంటి వారు విద్యార్థులకు ఎలా పాఠాలు చెప్తారు. ఈ వైఖరి సమంజసం కాదు. ఓపెన్ పరీక్షలంటే మాస్ కాపీయింగ్ చేయటం కాదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తాం.కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో ఈనెల 20వ తేది నుంచి ఏఓయూ డిగ్రీ మూడవ సంవత్సరం సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయ. ఈ పరీక్షల మొదటిరోజు నుంచి మహిళ ఉపాధ్యాయిని మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుంది. ఏకంగా పరీక్షకు సంబంధించిన బుక్‌లెట్‌ను పరీక్షా కేంద్రంలోకి తీసుకువచ్చి మాస్ కాపీయింగ్‌కు పాల్పడింది. దీనిని ఇన్విజిలేటర్ అడ్డుకున్నందుకు ఇష్టానుసారంగా మాట్లాడింది. అంతేకాకుండా డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ జె.ఉషారాణి పై కూడా దురుసుగా వ్యవహరిస్తూ దుర్భాషలాడింది. పైగా సదరు మహిళ తమ బంధువులను పిలిపించి పరీక్ష కేంద్రం వద్దకు గొడవ చేయడం సిగ్గుగా ఉంది. వారు కూడా తమను ఇష్టం వచ్చినట్లు చెప్పలేని పదాలతో దుర్భాషలాడారు. ఈ ఘటన బాధాకరం. సదరు మహిళా ఉపాధ్యాయినిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం. పరీక్షలు నిర్వహించాలంటేనే భయంగా ఉంది.

# 'విద్యాశక్తి'ని విజయవంతం చేయండి

## పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు



అమరావతి, (టుడే విదుర, జూన్ 25): చదువులో వెనకబడిన పిల్లల కోసం రూపొందించిన ప్రత్యేక బోధనా తరగతుల కార్యక్రమం 'విద్యాశక్తి'ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు కోరారు. విద్యాశక్తిపై విజయవాడలో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్జెక్టుల్లో వెనకబడిన విద్యార్థులకు పాఠశాలల పనివేళల అనంతరం అదనపు బోధనా తరగతులు నిర్వహించాలన్నారు. అభ్యసన సామర్థ్యాలు పెంచడం, డ్రాపౌట్లను తగ్గించడం, జీఈఆర్ పెంచడం లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

# ఇరువురు గేదెల దొంగలు అరెస్ట్

## 3.5 లక్షల విలువచేసే ఐదు పశువుల స్వాధీనం
## వివరాలను వెల్లడించిన ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ, (టుడే విదుర, జూన్ 25): గేదె లను దొంగతనం చేసిన ఇ రువురు నిందితులను ఎస్సై బి.మహేంద్ర అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.3.50 లక్షల విలువచేసే ఐదు గే దెలను స్వాధీనం చేసుకు న్నారు. స్థానిక పోలీస్‌స్టేష న్‌లో ఎస్సై మహేంద్ర మా ట్లాడుతూ ఈ నెల 2వ తేదీన మండలంలోని సోమరాజుపల్లికి చెందిన అర్రిబోయిన బ్రహ్మయ్య తన గేదెల షెడ్‌లో కట్టివేసిన ఐదు గేదెలు మా యమయ్యాయి. బ్రహ్మయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు న మోదుచేసి దర్యాప్తు ప్రారంభించిన ఎస్సై జరుగుమల్లి మండలం వావిలేటి పాడుకి చెందిన ఒక్కమంతుల ప్రసాద్, రావినూతల కొండలరావు నిందితు లుగా గుర్తించారు. ఇరువురుని అరెస్ట్ చేశారు. నిందితుల నుం చి ఐదు గేదెలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను కందు కూరు కోర్టులో హాజరపరచగా కోర్టు రిమాండ్ విధించింది.

# ఆ రెండు వసతి గృహాలకు డిమాండ్

## జమ్మలమడుగు ప్రభుత్వ బాలికల వసతి గృహం
## జమ్మలమడుగు, దొమ్మరనంద్యాల వసతి గృహాల్లో సీట్ల కోసం
## ఎగబడుతున్న విద్యార్థులు ఖాళీలు లేవంటున్న వార్డెన్లు



జమ్మలమడుగు,(టుడే విదుర, జూన్ 25): జమ్మలమడుగులోని ప్రభుత్వ వసతి గృహంతో పాటు దొమ్మరనంద్యాల వసతి గృహాల్లో సీట్ల కోసం విద్యార్థులు ఎగబడుతున్నారు. అయితే ఇప్పటికే విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని సీట్లు ఖాళీలు లేవంటూ వార్డెన్లు వచ్చిన వారిని వెన క్కి పంపివేస్తున్నారు. అదనపు సీట్లు పెంచి అక్కడే వసతి కల్పించాలంటూ విద్యార్థులతోపా టు వారి తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతు న్నారు. వివరాల్లోకి వెళితే.. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ముద్దనూరు రోడ్డులో గల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న కళాశాల వసతి గృహానికి సీట్ల డిమాండ్ పెరిగింది. కూటమి ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ముందుగా పట్టణంలోని, ఇతర గ్రామాల్లో ప్రభుత్వ వసతి గృహాల సమస్యలను పరిష్కరించారు. అందులో భాగంగా కళాశాల వసతి గృహానికి కొత్త భవనాల ఏర్పాటు కనీస సౌకర్యాలు కల్పించారు. కళాశాల ఆవరణంలోనే బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు చదువుకోవడానికి వసతి గృహంలోని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని వారి తల్లిదండ్రులు ఆ కళాశాల వసతి గృహంలో సీట్ల కోసం క్యూ కట్టారు. ప్రతిరోజు సీట్లు కావాలని వస్తున్నారు. అలాగే మైలవరం మండలం దొమ్మరనంద్యాల ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం పక్కనే జిల్లా పరిషత్ పాఠశాల ఉండడం వలన ఉపాధ్యాయులు చదువు చక్కగా చెబుతున్నారని పేరు ఉండడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అక్కడ పాఠశాలలు ఉన్నప్పటికి వసతి గృహంలో చేర్చి పాఠశాలకు పంపించేందుకు ఎక్కువ మంది వస్తున్నారు. అందుకోసం ఆ రెండు ప్రభుత్వ వసతి గృహాల్లో నిబంధనలకు మించి విద్యార్థులను చేర్చుకున్నట్లు వార్డెన్లు తెలిపారు. అయితే గత రెండు రోజుల నుంచి గ్రామీణ ప్రాంతాల నుంచి ఆ రెండు వసతి గృహాలకు 10వ తరగతి, ఇతర తరగతుల్లో , జూనియర్, డిగ్రీ కళాశాలలకు సంబందించిన కళాశాల వసతి గృహానికి విద్యార్థులు సీట్లు కావాలని వస్తున్నారు. ప్రస్తుతం అక్కడ అన్నీ సీట్లు భర్తీ అయ్యాయని అక్కడ పనిచేస్తున్న వార్డెన్లు మనోరాణి , వెంకటరెడ్డి వస్తున్న దరఖాస్తులను సీట్లు లేవని వెనక్కు పంపుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వం జమ్మలమడుగులోని ప్రభుత్వ బాలికల వసతిగృహంలో కాకుండా ఇతర ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు సన్నబియ్యం, భోజనంపెడుతుండడంతో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, బీసీ వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. అయితే ఆ రెండు వసతి గృహాలకు సంబందించి గత నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి దృష్టికి ఆ వార్డెన్లు సీట్లు పెంచాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేయాలని కోరినట్లు తెలిసింది.ఒక్కొక్క వసతి గృహంలో వంద మంది ఉండాల్సిన విద్యార్థులకు 115 మంది ఉన్నట్లు, ఇంకా పెంచాలని వార్డెన్లు కోరుతున్నారు. కొందరు సీట్లు తప్పనిసరిగా ఇవ్వాలంటూ సంబందిత నేతల లెటర్‌ప్యాడ్లు తీసుకుని వస్తున్నారని వెంటనే జిల్లా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వార్డెన్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

## ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈ మురళీకృష్ణ
## హౌసింగ్ డీఈ మురళీకృష్ణ



సుండుపల్లె,(టుడే విదుర, జూన్ 25): ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి వందశాతం లక్ష్యం సాధించాలని రాజంపేట హౌసింగ్ డీఈ మురళీకృష్ణ సూచించారు. సుండుపల్లెలోని లేఅవుట్లలో జరుగుతున్న ఇంటి నిర్మాణాల పురోగతిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు నిర్మాణాలు పూర్తయ్యేలా అర్హులతో చేయించాలన్నారు. బిల్లులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఏఈ నాగరాజునాయక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నరేశ పాల్గొన్నారు.

# కష్టపడి చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలి


## విద్యార్థినులతో మాట్లాడుతున్న ఫుడ్ కార్పొరేషన చైర్మన విజయప్రతాప్‌రెడ్డి
## ఏపీ ఫుడ్ కార్పొరేషన చైర్మన విజయప్రతాప్‌రెడ్డి



కలసపాడు(టుడే విదుర, జూన్ 25): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఏపీ ఫుడ్ కార్పొరేషన చైర్మన చిత్తా విజయప్రతాప్‌రెడ్డి సూచించారు. ఆయన మండల పరి ధిలోని పెండ్లిమర్రి వద్దనున్న కస్తూ ర్బా గాంధీ బాలికల పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భం గా వంటశాల, స్టోర్, ఆఫీస్ రూములను పరిశీలించారు. విద్యార్థినులకు వండిన వంట లను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై ఆయ న పాఠశాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం బాగుందని, మెనూలో టిఫెనలో మార్పులు చేస్తామని ఆయన విద్యా ర్థినులకు సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించేందుకు తోడ్పడాలని ఉపాధ్యా యులకు ఆయన సూచించారు.

# అరకొర పదునులోనే కంది సాగు

## ఎద్దుల గొర్రుతో కంది సాగు చేస్తున్న రైతులు



విడపనకల్లు,(టుడే విదుర, జూన్ 25): మండలంలోని రైతులు కంది సాగును అరకొర పదునులోనే ప్రారంభించారు. ఉండబండ, చీకలగురికి, విడపనకల్లు, వేల్పుమడుగు, పెద్ద కొట్టాలపల్లి, పాల్తూరు గ్రామాల్లో రైతులు ఈ పనులు చేపట్టారు. జూన మొదటి వారం నుంచే కందిని సాగు చేయాల్సిన రైతులు ... నెల చివరిలో సాగుకు సన్నద్ధం అయ్యారు. ఎర్ర నేల, నల్లరేగడిలోను విత్తును ప్రారంభించారు. ఇంకో వర్షం పడి ఉంటే పొలాలు మంచి పదును అయి ఉండేవని.. కానీ అదును దాటితే ఇబ్బందులు అవుతాయని అరకొర పదునులోనే విత్తనం సాగు చేస్తున్నట్లు రైతులు తెలిపారు.

# ‘నవోదయం’.. నై!

- నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించని నాటుసారా ప్రభావిత గ్రామం
- 2.0 కార్యక్రమం అమలులో నిర్లక్ష్యం
- కొన్నిచోట్ల తూతూమంత్రంగానే నిర్వహణ
- ఏజెన్సీలో సారా తయారీ, విక్రయాలు
- బానిసలై తీవ్రంగా నష్టపోతున్న గిరిజనులు
- ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు



సీతంపేట (టుడే విదుర, జూన్ 25): గిరిజన ప్రాంతాల్లో నాటుసారా నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమం విజయవంతం చేయగలిగితే మంచి ఫలితాలే వస్తాయి. కానీ సీతంపేట ఏజెన్సీలో ఆ పరిస్థితి లేదు. ఎక్సైజ్‌శాఖ నిర్లక్ష్యం , అధికారుల మధ్య సమన్వయం లోపం కారణంగా లక్ష్యం నీరుగారుతోంది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో సారా ప్రభావిత గ్రామాల్లో తూతూ మంత్రగా నవోదయం 2.0 గ్రామసభలు నిర్వహించి మమ అనిపించారు. దీంతో ఏజెన్సీలో నాటుసారా ఏరులై పారుతోంది. ఈ దందా మూడు పూలు.. ఆరుకాయలుగా సాగుతోంది. యథేచ్ఛగా తయారీ, రవాణా, విక్రయాలు సాగుతున్నాయి. ఎక్సైజ్ శాఖాధికారులు గుర్తించిన గ్రామాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో సారా తయారీ జరుగుతోంది. ఈ వ్యాపారాన్నే నమ్ముకొని కొన్ని కుటుంబాలు జీవిస్తున్నాయి. సారా తయారీకి ఉపయోగించే ముడిసరుకుల వ్యాపారం కూడా జోరుగా సాగుతోంది. నిషేధం అమలులో ఉన్నా.. కొందరు వ్యాపారులు యథేచ్ఛగా నల్లబెల్లం విక్రయిస్తున్నారు. అయినా దీనిపై పట్టించుకునే వారే కరువయ్యారు.

**నవోదయం 2.0 ఏం చెబుతుందంటే..**

నవోదయం 2.0లో ఎక్సైజ్‌శాఖ, పోలీస్ ,గ్రామస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి నాటుసారా ప్రభావిత గ్రామాల్లో పర్యటించాల్సి ఉంది. సారా వినియోగంపై అనర్థాలు, తయారీ, రవాణా, అక్రమ విక్రయాలపై చట్టపరమైన చర్యలపై ప్రజలకు తెలియజేయాల్సి ఉంది. అంతేకాకుండా సారా తయారీదారులకు గ్రామస్థులు సహకరిస్తే ఆయా గ్రామాలకు ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయనే సందేశాన్ని చేరవేయాలి. సారా తయారీని విడిచిపెట్టిన వారికి ప్రత్యామ్నాయంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా కల్పించాల్సి ఉంది. మరో పక్క సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం సరఫరాదారులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలి. ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించిన సారా ప్రభావిత గ్రామాలపై దాడులు చేసి.. నివారణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. నాటుసారా తయారీ, విక్రయాలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని 14405 టోల్ ఫ్రీ నెంబర్‌ను కూడా ప్రకటించారు. అయితే సీతంపేట మన్యంలో మాత్రం ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యాలకు సంబంధిత శాఖ అధికారులు తూట్లు పొడుస్తున్నారు.

**సారా ప్రభావిత గ్రామాలు ఇవే..**

సీతంపేట మన్యంలో ఎక్సైజ్‌శాఖ గుర్తించిన 13 నాటుసారా ప్రభావిత గ్రామాలను ఏ,బీ,సీ క్లాసులుగా విభజించారు. ఈ మేరకు ఏ క్లాసులో మండ, నారాయణగూడ, ఈతమానుగూడ, బుడగరాయి గ్రామాలున్నాయి. బీ క్లాసులో సుందరయ్యగూడ, పెదవంగర ఉన్నాయి. సీ క్లాసులో సీతంపేట, పనసగూడ, అడ్డాకులగూడ, చినబగ్గ, కుసిమిగూడ, మండకాలనీ ఉన్నాయి. ఆయా గ్రామాల్లో నవోదయం 2.0 కార్యక్రమాలు నిర్వహించి సారాను పూర్తిగా నిర్మూలించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఇటీవల కాలంలో బీ,సీ క్లాసుల పరిధిలో ఉన్న సారా ప్రభావిత గ్రామాల్లో అక్కడక్కడ మాత్రమే నవోదయం 2.0 కింద గ్రామసభలు నిర్వహించారు. ఏ క్లాసులో ఉన్న నాలుగు గ్రామాల్లో ఇంతవరకు ఎటువంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టలేదు. మిగిలిన గ్రామాల్లో నవోదయం 2.0లో అవగాహన సదస్సులు నిర్వహించినప్పటికీ సారా తయారీ, రవాణా, విక్రయాలు అదుపులోకి రాలేదు. దీంతో నాటుసార రహిత గ్రామాలుగా ఇంతవరకు వాటిని ప్రకటించలేకపోయారు.

# 16 మంది బీసీ హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత

**ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు**
**శ్రీకాళహస్తిలో కలకలం**
**పిల్లలను పరామర్శించిన నేతలు, విద్యార్థి, ప్రజాసంఘాలు**



శ్రీకాళహస్తి,(టుడే విదుర, జూన్ 25): అస్వస్థతతో 16 మంది హాస్టల్ విద్యార్థులు ఒకేసారి ఆస్పత్రిలో చేరడంతో శ్రీకాళహస్తిలో కలకలం రేగింది. సంస్కృత పాఠశాల సమీపంలోని బీసీ వసతిగృహంలో 56మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. దీనిని ఫిబ్రవరిలో బీసీ సంక్షేమశాఖ అధికారులు ప్రారంభించారు. నాలుగు రోజుల కిందట నిర్వహించిన బదిలీల్లో ఇక్కడి వార్డెన్ రామయ్యను సత్యవేడుకు బదిలీ చేశారు. ఏర్పేడు బీసీ హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లుకు ఇక్కడి బాధ్యతలు అప్పగించారు. పాతవార్డెన్ నాటికి చార్జ్ అప్పగింత పూర్తికాలేదు. బదిలీల కారణంగా పాత, కొత్త వార్డెన్ల మధ్య మనస్పర్థలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో ఉదయం ఇన్‌ఛార్జి వార్డెన్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 56మంది విద్యార్థులకు మెనూ ప్రకారం ఇడ్లీ, వేరుశనగ పప్పు చట్నీతో అల్పాహారం అందించారు. కాసేపటికి ఒప్పంద ఉద్యోగి వినోద్ హాస్టల్‌కు వచ్చారు. తమకు వాంతులు అయ్యాయని కొందరు.. కడుపునొప్పితో వాంతులు అయ్యేలా ఉన్నాయని కొందరు పిల్లలు అతడికి చెప్పారు. కాసేపటికే కొందరు విద్యార్థి సంఘ నాయకులకు, మీడియాకు సమాచారం అందింది. అక్కడే ఉన్న వార్డెన్ 16 మందిపిల్లలను ప్రైవేటు వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాసేపటికి విద్యార్థుల అస్వస్థతపై సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున వైరల్‌గా మారింది. ఎమ్మెల్యే సుధీర్ సూచనలతో టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నేతలు ఆస్పత్రికి చేరుకుని పిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వీడియోకాల్ ద్వారా ఆస్పత్రి సూపరింటెండెంట్ మణితో ఎమ్మెల్యే మాట్లాడి.. పిల్లల యోగక్షేమాలను తెలుసుకున్నారు. హాస్టల్‌లో ఇడ్లీ తయారుచేసిన పిండి పులిసినట్లుగా ఉందని సూపరింటెండెంట్ అనుమానం వ్యక్తం చేశారు. ఇద్దరికి మాత్రమే వాంతులయ్యాయని, ఆస్పత్రికి వచ్చాక మళ్లీ కాలేదన్నారు. మిగతా 14మంది కేవలం వాంతులు అవుతాయన్న లక్షణాలతో ఆస్పత్రిలో చేరారని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో మాట్లాడారు. ఇక, టీడీపీ నేతలు కంఠా రమేష్, రెడ్డివారి గురవారెడ్డి, బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, పట్టణ కార్యదర్శి గోపి, విద్యార్థి సంఘాల నాయకులు, జనసేన, బీజేపీ, వైసీపీ నేత అంజూరు శ్రీనివాసులు, కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త దామోదర్‌రెడ్డి తదితరులు విద్యార్థులను పరామర్శించారు. ఈ ఘటనపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కాగా, 14 మంది విద్యార్థులను మధ్యాహ్నం డిశ్చార్జి చేశారు. భరత్, నవదీపకు కడుపు నొప్పి తగ్గలేదని చెప్పడంతో చిన్నపిల్లల వార్డుకు తరలించి చికిత్స అందించారు. ఆస్పత్రిలో చేరిన వారు: రాజా, చరణ్, సుమన్‌కుమార్, ప్రేమ్‌కుమార్, చాన్, మహేంద్ర, ప్రేమ్‌కుమార్, విష్ణు, భరత్, రాజేష్, రోహిత్, జస్వంత్, రేవంత్, దేవేంద్ర, యశ్వంత్, నవదీప్.

# జనగణనకు జేగంట

**16వ జనాభా లెక్కల సర్వేకు సమాయత్తం – ఈసారి కులగణన కూడా**



చిత్తూరు (టుడే విదుర, జూన్ 25): పదేళ్లకు ఒకసారి నిర్వహించే జనాభా లెక్కలతో ఎన్నో ప్రయోజనాలుంటాయి. ప్రజల జీవన ప్రమాణాలను మార్చేందుకు ఉద్దేశించిన పథకాల రూపకల్పనకు జనాభా లెక్కలే కీలకం. అన్ని ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధి, పాలనాసౌలభ్యం, పేదరిక నిర్మూలన వంటి అంశాలకు ఇది దోహదం చేస్తుంది. ఇంతటి ప్రాధాన్యం కల్గిన జనగణన 2021లో జరగాల్సి ఉండగా, కోవిడ్ కారణంగా వాయిదా పడింది. కోవిడ్ తగ్గుముఖం పట్టాక సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఈ అంశం పక్కకు వెళ్లింది. ఎట్టకేలకు కేంద్రప్రభుత్వం జనగణనకు జేగంట కొట్టింది. 16వ జనాభా లెక్కల సర్వే నిర్వహణకు పచ్చజెండా ఊపడంతో జిల్లా యంత్రాంగం సమాయత్తం అవుతోంది. ఈసారి జనగణనతోపాటు కులగణన కూడా చేపట్టడం ప్రత్యేకం.

నూతన జిల్లా ప్రాతిపదికన చివరిసారిగా 2011లో నిర్వహించిన జనాభా లెక్కల సర్వేకు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదిక అయ్యింది. ఈసారి నూతన జిల్లా ప్రాతిపదికన సర్వే జరగనుంది. ప్రస్తుత జిల్లా జనాభా 18.73 లక్షలు (అంచనా). ఇందులో పురుషులు 9.40లక్షలు , మహిళలు 9.33 లక్షలు.

కాగిత రహితం..ప్రజలే గణకులు ఇప్పటివరకు నిర్వహించిన జనాభా లెక్కల సర్వేల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించారు. వారే గణకులుగా ప్రతి ఇంటినుంచి లెక్కలు సేకరించారు. దీనికితోడు ఆరునెలల నుంచి ఏడాదిపాటు జరిగే సర్వేకు ఉమ్మడి జిల్లాలో వందల టన్నుల కాగితం వినియోగించాల్సి వచ్చేది. తాజాగా జరగనున్న 16వ జనాభాలెక్కల సేకరణ కాగితరహితంగా డిజిటల్ యాప్‌ల ద్వారా సర్వే చేపట్టనున్నారు. ఉపాధ్యాయులకు తోడు ప్రజలే గణకులుగా మారబోతున్నారు. సర్వేలో స్వీయధ్రువీకరణతో ప్రజలే వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించబోతున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యవేక్షణలో జన, కులగణన సర్వే నిర్వహించనున్నారు. 2026 మార్చి నెలాఖరు నాటికి ఈ సర్వే చేయాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు అందాయి. జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ త్వరలో సమావేశం నిర్వహించనున్నారు. ఏ విధంగా జనగణన చేయాల్సిన అంశాలపై పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు ఆతర్వాత విడుదల అవుతాయని అధికారులు చెబుతున్నారు.

# తోతాపురి ధరలు తగ్గిస్తే ర్యాంపులు సీజ్

- ర్యాంపు నిర్వాహకులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వరన్
- మార్కెటింగ్ శాఖ అధికారుల హెచ్చరిక
- అయినా మరో కిలోకి 50 పైసలు పతనం




చిత్తూరు (టుడే విదుర, జూన్ 25): తోతాపురి రకం మామిడి కాయల కొనుగోలు ధరలు తగ్గిస్తే ర్యాంపులు సైతం సీజ్ చేసేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు సిద్ధమయ్యారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ చేసుకున్న 35 ర్యాంపుల్లో ప్రస్తుతం 23 ర్యాంపుల్లో మామిడి క్రయ, విక్రయాలు సాగుతున్నాయి.ర్యాంపుల్లో కిలో 4రూపాయలుగా వున్న ధరలు సోమవారం రూపాయి పతనమై రూ.3కు చేరుకున్నాయి. దీనిపై కలెక్టర్, మార్కెటింగ్ అధికారులు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. జిల్లావ్యాప్తంగా ర్యాంపులకు మామిడి సరఫరా అధికం కావడంతో మంగళవారం మరో రూపాయి పతనమై చివరకు రూ.2కు చేరింది. దీనిపై ఇటు కలెక్టర్, అటు మార్కెటింగ్ శాఖ అధికారులు సీరియస్ అయ్యారు. ధర మరింత పతనం కావడంతో తవణంపల్లె మండలం గాజులపల్లెలోని తిరుమల ర్యాంపు వద్ద రహదారిపై రైతులు బైఠాయించి నిరసనలు చేపట్టారు. సమాచారం అందుకున్న మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వరన్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని కనీస ధర రూ.4కు కొనుగోలు చేయాలని ర్యాంపు నిర్వాహకులపై ఒత్తిడి తెచ్చారు. తమకు నష్టం వస్తుందని, రూ.2కే కొనుగోలు చేస్తామని నిర్వాహకులు చెప్పడంతో, ర్యాంపును సీజ్ చేస్తామని ఏడీ హెచ్చరించారు. ఈ విషయాన్ని ఇటు అధికారులు, అటు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు.

# విద్యార్థులకు బ్యాక్ పుస్తకాలు పంపిణీ ఎంఈఓ



(టుడే విదుర, జూన్ 25): కార్వేటినగరం మండలంలో ఉన్న ఉర్దూ స్కూల్ లో బడి ఏడు పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పుస్తకాలు ఎంఈఓ విజయ్ కుమార్, మనోజ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ లు ఉర్దూ భాషను గౌరవిస్తూ ప్రతి పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను ఉర్దూ స్కూల్లో చేర్పించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉర్దూ పాఠశాలలో చేసిపించడానికి కృషి చేస్తున్న ప్రభుత్వ సార్ ఖాజీ కె.జాఫర్ అలిహానాఫీ,ఢంకా హమీద్ భాషా, షేక్ సంధాని లను ఎంఈఓ లు అభినందించారు. ఉర్దూ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు జబిన సుల్తాన్, సహిత విద్య ఉపాధ్యాయులు సింధుజ,రేఖ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమిద్ భాషా, సందని పాల్గొన్నారు. బ్యాగ్స్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

# పెరిగిన టమోటా ధరలు



సోమల, (టుడే విదుర, జూన్ 25): టమోటా ధరలు రెండు రోజులుగా పెరుగుతున్నాయి. మంగళవారం 15 కిలోల బాక్స్ ధర రూ.300కు చేరుకొంది. ధరలు లేని సమయంలో ఎండల తీవ్రతతో తోటల్లోనే కాయలు మాగిపోయి బాక్స్ రూ. 100కే అమ్మాల్సి వచ్చింది. ఒక్కో రైతు రోజుకు 300నుంచి 500 బాక్సులకు మించి కోతలు చేపట్టారు. మూడు నెలలుగా కోత కూలీ డబ్బు రాకపోవడంతో కోతలు ఆపేశారు. కూలీ డబ్బులు చేతి నుంచి చెల్లించి నష్టపోయారు. ప్రస్తుతం ఏప్రిల్ నెలలో నాటిని తోటల నుంచి కోతలు వస్తున్నాయి. ఆ తోటల్లోనూ సగం కోతలు పూర్తి చేశారు. దిగుబడులు అధికంగా ఉన్నప్పుడు ధరలు లేక నష్టపోయారు. అరకొరగా పంట ఉన్నప్పుడే ధరలు పెరగడంతో కొందరు మాత్రమే ఈ ధరలు పొందుతున్నారు. పలమనేరు, పుంగనూరు, కోలారు, మదనపల్లె తదితర టమోటా మార్కెట్లలో 15 కిలోల బాక్స్ రూ. 300 లకు మించి ధరలు పలుకుతున్నాయి.

# శక్తి యాప్‌పై అవగాహన



గోపాలపట్నం,(టుడే విదుర, జూన్ 25): హెచ్ సి వెంకట్రావు గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కాలేజీల్లో శక్తియాప్‌పై విద్యార్థులకు హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు అవగాహన కల్పించారు. పోక్సోచట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి విషయాలను వివరించారు. పిల్లలు బయట ఎలా ప్రవర్తించాలి, అపరిచితుల పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. పిల్లల భద్రతపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలన్నారు. పిల్లలకు మంచి ఏదో.. చెడు ఏదో తల్లిదండ్రులు వివరించాలని చెప్పారు. ఏ టచ్ ఎలాంటిదో.. ఎవరిని దగ్గరగా రానివ్వకూడదో.. ఎవరూ ఎక్కడ తాకకూడదో చెప్పడానికి సంకోచిస్తున్నారని, ఈ ధోరణిని వీడి, పిల్లలకు ఏది మంచో, ఏది చెడో వివరించాలని కోరారు. అత్యవసర సమయాల్లో మహిళలు శక్తి యాప్ వినియోగించుకోవాలని, మహిళల భద్రత కోసమే ఈ యాప్ ప్రత్యేకంగా రూపొందించబడిందని తెలిపారు. ప్రతి మహిళా శక్తి యాప్‌ను ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న వారి ఫోను కంట్రోల్ రూమ్‌కు కనెక్ట్ అవుతుందని తెలిపారు. ప్రమాదంలో కానీ, అత్యవసర సమయాల్లో ఫోనును 5 సార్లు షేక్ చేస్తే ప్రమాదంలో ఉన్నట్లు కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వస్తుందన్నారు. దీంతో దగ్గర్లోని పోలీసులు 5 నిమిషాల్లో బాధిత మహిళల వద్దకు వచ్చి సహాయం చేస్తారని వెల్లడించారు. వీటితోపాటు సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నంబర్లను వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు జగన్నాథం, ప్రసాద్, లీలా, పార్వతీదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పనపాడులో భారీ చోరీ

**చోరీ జరిగిన ఇంటి వద్ద పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఎస్పీ ప్రసాద్**

**రూ.9.5 లక్షల నగదు, 30 గ్రాముల బంగారం అపహరణ**



మండపేట,(టుడే విదుర, జూన్ 25): కోనసీమ జిల్లా మండపేట మండలం ఇప్పన పాడులో భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెం దిన నీలాటి అదినారాయణ, భార్య సూర్య కుమారితో కలిసి ఈనెల 19న హైదరాబాద్‌లో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇంటికి వచ్చేసరికి తాళాలు బద్దలుగొట్టి ఉన్నట్టు గుర్తించారు. ఇంటిలో ఉంచిన రూ.9.5 లక్షల నగదు, 30 గ్రాముల బంగారం దోచుకు పోయారని బాధితులు మండపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రామచంద్రపురం ఇన్‌చార్జి డీఎస్పీ ప్రసాద్, మండపేట రూరల్ సీఐ పి.దొర్రాజు, క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లోని చిందర వందరగా పడి ఉన్న సామాన్లను పరిశీలించారు. ఇంట్లోని బీరువా లాకర్‌లు మూడు ఉండగా, వాటిలో ఒకటి మాత్రమే దొంగలు బద్దలుగొట్టి నగదు, బంగారం కాజేశారు. మిగిలిన రెండు లాకర్లను ఇంటి యజమాని తెరిచి చూడగా వాటిల్లోని 160 గ్రాముల బంగారంతో పాటు రూ.1.5 లక్షల నగదు సురక్షితంగా ఉన్నాయని తెలిపాడు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ వి.కిషోర్ పేర్కొన్నారు.

# ఇంటర్ విద్యాశాఖపై అవినీతి ఆరోపణలు

**పదోన్నతులకు ముడుపులపై ఫిర్యాదులు**

**సూపరింటెండెంట్‌ను విచారించిన ఏసీబీ**

అమరావతి,(టుడే విదుర, జూన్ 25): ఇంటర్మీడియట్ విద్యాశాఖపై అవినీతి ఆరోపణలు గుప్పుమన్నాయి. పలు పోస్టులకు పదోన్నతుల విషయంలో ముడుపులు డిమాండ్ చేశారనే అంశం ఏసీబీ విచారణకు దారితీసింది. తాజాగా కమిషనరేట్‌లోని ఓ సూపరింటెండెంట్‌ను ఏసీబీ అధికారులు విచారించారు. ఇంటర్ విద్యాశాఖలో ఇటీవల పలువురికి పదోన్నతులు ఇచ్చారు. దీనికోసం ఓ సూపరింటెండెంట్ స్థాయి అధికారి నగదు వసూలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. బోధనేతర ఉద్యోగిగా పనిచేస్తున్న ఓ దివ్యాంగ ఉద్యోగి లైబ్రేరియన్ నుంచి సదరు సూపరింటిండెంట్ రూ.లక్ష డిమాండ్ చేశారని తెలిసింది. దీనిలో భాగంగా తొలుత రూ.15 వేలు గూగుల్ పే ద్వారా తన ఖాతాలో వేయించుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. అయినా పదోన్నతి రాకపోవడంతో ఆ ఉద్యోగి ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఆ ఉద్యోగి తన సమస్యతోపాటు ఇతరుల ముడుపుల విషయాన్ని కూడా ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సూపరింటెండెంట్‌ను ఏసీబీ అధికారులు విచారణకు పిలిచారు. కొన్ని లావాదేవీలపై ఆయన గుర్తులేదని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఆయనకు సంబంధించిన బ్యాంకు లావాదేవీలను ఏసీబీ ఆరా తీసింది. కాగా, ఆ అధికారిపై ఇద్దరు మంత్రులు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది

# మధ్యాహ్న భోజనం నాణ్యత



(టుడే విదుర, జూన్ 25): మండల పరిధిలోని డిఎం పురం ఉన్నత పాఠశాలలో సనా బియ్యం నాణ్యత కాలిగా ఉందని ఇంచార్జ్ హెచ్చం సరస్వతి తెలిపారు. మధ్యాహ్నం పిల్లలకు ఏర్పాటు చేసిన భోజనం చాలా బాగుందని, విద్యార్థులు అధికసంఖ్యలో భోజన చేస్తున్నారని పేర్కొన్నారు.పిల్లల భోజనం నాణ్యత లో రాజి పడకుండా చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి పాఠశాలల్లోనే భోజనం తినడంపై ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు వర్షం వ్యక్తం చేస్తున్నారు.మెనూ ప్రకారం ప్రతి రోజు విద్యార్థుకు భోజనం వడిస్తునామన్నారు. దీంతోపాటు విద్యార్థులకు నూతన యూనిఫామ్, టై, షు, బెల్ట్, నాణ్యతగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్ఎం కే సరస్వతి ఉపాధ్యాయులు రంజిత్, కిషోర్,ఢిల్లీ, బాబు, రాములు,కలైరాణి, సుమతి రాము హరి పాల్గొన్నారు.

# ఆగని ఏనుగుల దాడులు

(టుడే విదుర, జూన్ 25): ఆగని ఏనుగుల దాడులు రొంపిచర్ల: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ పాలెం చుట్టుపక్కల గ్రామం నందు తెల్లవారుజామున ఏనుగుల గుంపు రైతు గురు స్వామికి చెందిన మామిడి తోటలకి ప్రవేశించి మామిడి చెట్లను విరిచేసి, చుట్టూ ఉన్న కంచుకు ఏర్పాటు చేసినటువంటి రాతికూసాలను విరిచేశాయి. పక్కనే ఉన్నటువంటి అదే గ్రామానికి చెందిన రైతుల పంట పొలాలను, మామిడి కొమ్మలను విరిచేసి అడవిలోకి వెళ్లిపోయాయి. పులిచెర్ల మండలంలో ప్రతిరోజు ఏనుగుల బెడదతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం తెలియడంతో పంట పొలాలను పరిశీలించారు.



# ప్రభుత్వమే పొగాను కొనాలి



నంద్యాల (టుడే విదుర, జూన్ 25): పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్‌కుమార్, రాజశేఖర్ డిమాండ్ చేశారు. జిల్లాలో పొగాకు పండించిన రైతాంగం గత రెండు నెలల నుంచి కొనుగోలు చేయాలని ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేయకుండా తాత్సారం వహించడంతో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పొగాకు రైతులు పెద్ద ఎత్తున కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. పొగాకు బేళ్లను కుప్పగా పోసి నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ధర్నాను విరమింపజేయాలని త్రీ టౌన్ సీఐ కంబగిరిరాముదు, సిబ్బంది చెప్పినప్పటికీ సంఘం నాయకులు, రైతులు కలెక్టరేట్ ఎదుట ఉన్న కర్నూలు–కడప జాతీయ రహదారిపై బైఠాయించి దిగ్బంధించారు. ఆందోళనను విరమింపజేయాలని పోలీసులు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులకు, రైతులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. సీఐ కంబగిరి రాముడు నచ్చచెప్పడంతో రైతులు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పొగాకు కొనుగోలులో జరుగుతున్న లోపాలపై చర్చించి మూడురోజుల్లోపు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని జేసీ చెప్పడంతో రైతులు ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ కంపెనీలు ఒప్పందం ప్రకారం పొగాకును కొనుగోలుచేయకపోవడంతో రైతులు రూ. లక్షల్లో నష్టపోవాల్సివస్తోందని,

# టుడే వినోదం



## మహేష్ బాబులా ఉండాలని చాలా ట్రై చేశా





## జడ్జ్ చేసుకుంటాడు

ఇప్పుడంటే త్రిష తెలుగులో అంతగా కనిపించడం లేదు కానీ, ఒకప్పుడు టాలీవుడ్ నెంబర్ వన్ హీరోయిన్ గా కొనసాగింది. స్టార్ హీరోల సరసన నటిస్తూ మంచి గుర్తింపును తెచ్చుకుంది. వర్షం, అతడు, నువ్వొస్తానంటే నేనొద్దంటానా, పౌర్ణమి, సైనికుడు ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. ప్రతి సినిమాలో ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకొని టాలెంటడ్ నటి అని అనిపించుకుంది. కొత్త కొత్త హీరోయిన్లు ఎంట్రీ ఇవ్వడంతో తమిళ్ కి వెళ్లి అక్కడ సెటిల్ అయిన త్రిష చాలా గ్యాప్ తరువాత చిరంజీవి పక్కన విశ్వంభర సినిమాలో కనిపించనుంది. ఇప్పటికే చిరు – త్రిష కాంబోలో స్టాలిన్ సినిమా వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం తమిళ్ లో లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో బిజీగా ఉన్న త్రిష.. ఈమధ్య విజయ్ తో రిలేషన్ వార్తలతో సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో ఉంటుంది. ఇక ఇవన్నీ పక్కన పెడితే తాజాగా త్రిష ఒక ఇంటర్వ్యూలో మహేష్ బాబు గురించి ఒక ఆసక్తికరమైన విషయం చెప్పుకొచ్చింది.

## శ్రీనివాస్ నేదునూరికి క్రియేటివ్ రైటర్, డైరెక్టర్ అవార్డ్

'సంధ్యారాగం' చిత్రంతో విమర్శకుల ప్రసంశలు అందుకుని ఉత్తమ దర్శకుడిగా పలు పురస్కారాలు అందుకున్న దర్శకుడు శ్రీనివాస్ నేదునూరి రచన,దర్శకత్వ విభాగాలలో కనపరుస్తున్న ప్రతిభను గుర్తించి బెస్ట్ క్రియేటివ్ రైటం డైరక్టర్ పురస్కారం వరించింది .వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి గుర్తింపు కల్పించేందుకు విజన్ స్టూడియోస్ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన 'ఐకాన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025' కార్యక్రమం హైదరాబాద్ దసపల్లా హొటల్‌లో వైభవంగా



జరిగింది.%వివిధ రంగాలలో ప్రతిభ కనపరిచిన వ్యక్తులకు ఐకాన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై అవార్డులను ప్రదానం చేశారు. వ

## శ్రీకృష్ణ పాత్రతో రాజయోగం ఖాయం...




శ్రీకృష్ణ పరమాత్మ పాత్రలో విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు యన్టీఆర్ అభినయం అనితరసాధ్యంగా సాగింది. ఆయన నటవారసులుగా జనం ముందు నిలచిన హరికృష్ణ బాలకృష్ణ కూడా శ్రీకృష్ణ పాత్రల్లో కనిపించారు. యన్టీఆర్ మూడో కూతురు భువనేశ్వరి సైతం 'మనుషుల్లో దేవుడు' చిత్రంలో ఓ పాటలో శ్రీకృష్ణునిగా కాసేపు కనిపించారు. ఇలా నందమూరి ఫ్యామిలీలో శ్రీకృష్ణ పాత్ర పోషించిన ఈ నలుగురికీ రాజయోగం పట్టిందని చెప్పవచ్చు. రాజకీయాల్లో యన్టీఆర్ సృష్టించిన చరిత్ర గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇక హరికృష్ణ తండ్రి ప్రాతినిధ్యం వహించిన హిందూపురం ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తరువాత రాజ్యసభ సభ్యునిగానూ సాగారు. కొన్నాళ్ళు ఏపీ ట్రాన్స్ పోర్ట్ మినిస్టర్ గానూ పనిచేశారు హరికృష్ణ. ఇక బాలయ్య విషయానికి వస్తే తండ్రి ప్రాతినిధ్యం వహించిన అదే హిందూపురం నుండి ఆయన వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై చరిత్ర సృష్టించారు. భువనేశ్వరి ఇప్పటికే నాలుగుసార్లు ముఖ్యమంత్రి భార్య హోదాలో సాగుతున్నారు. ఇలా ఎలా చూసినా నందమూరి ఫ్యామిలీలో శ్రీకృష్ణ పాత్ర పోషించిన వారికి రాజయోగం పట్టిందని చెప్పవచ్చు. జూనియర్ కు కూడా ఆ అదృష్టం కలగాలంటే ఆయన కూడా ఏదైనా సినిమాలో శ్రీకృష్ణునిగా కనిపిస్తే బాగుంటుందని అభిమానుల అభిలాష!

## మజ్దూర్ గా హిందీలో కూలీ...




సౌతిండియన్ సూపర్ స్టార్ రజనీకాంత్ స్టైల్ కు ఉత్తరాది ప్రేక్షకులు సైతం సాహో అనేస్తారు. అయితే కొంతకాలంగా రజనీకాంత్ సినిమాలేవీ హిందీలో పెద్దంతగా ఆడటంలేదు. బట్... 'జైలర్' వంటి సినిమా అందుకు మినహాయింపు. సౌత్ లోనే కాదు నార్త్ తోనూ ఆ సినిమా దుమ్ము రేపింది.%ఈ నేపథ్యంలో ప్రముఖ తమిళ దర్శకుడు లోకేష్ కనకరాజ.. రజనీకాంత్ తో పాన్ ఇండియా మూవీగా 'కూలీ'ని తెరకెక్కిస్తున్నాడు. ఇందులో కింగ్ నాగార్జునతో పాటు కన్నడ స్టార్ హీరో కమ్ డైరెక్టర్ ఉపేంద్ర, ఉత్తరాది స్టార్ హీరో ఆమిర్ ఖాన్ సైతం కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'కూలీ' సినిమాకు దక్షిణాదిన మంచి క్రేజ్ ఏర్పడింది. అది రజనీకాంత్ తో పాటు దర్శకుడు లోకేష్ కు ఉన్న పేరు కారణంగానే! అయితే... ఉత్తరాదిన మాత్రం 'కూలీ'కి నెగెటివ్ ప్రచారం మొదలైనట్టు తెలుస్తోంది. ఈ సినిమా హిందీలో 'మజ్దూర్' పేరుతో విడుదల చేయాలని మేకర్స్ భావించారట. అయితే 'కూలీ' అనే పదంలో ఉన్న ఫోర్స్ 'మజ్దూర్'లో లేదని కొందరు అంటున్నారు.

## శ్రీరామ్‌కు జ్యుడీషియల్ కస్టడీ



మాదక ద్రవ్యాల వినియోగం కేసులో అరెస్టయిన తమిళ నటుడు శ్రీరామ్ (శ్రీకాంత్)పై పోలీసులు నాలుగు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మాదక ద్రవ్యాల కేసులో అరెస్టయిన అన్నాడీఎంకే ఐటీ విభాగం ఇన్‌చార్జి ప్రసాద్, సేలంలోని మాదక ద్రవ్యాల వ్యాపారి ప్రదీపకుమార్ వాంగ్మూలం ప్రకారం శ్రీరామ్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మాదకద్రవ్యాల నిరోధక విభాగం పోలీసుల విచారణలో తొలుత శ్రీరామ్ తానెలాంటి డ్రగ్స్ కొనలేదని, మాదక ద్రవ్యాల ముఠాతో ఎలాంటి సంబంధాలు లేవని చెప్పారు. అయితే మాదక ద్రవ్యాల వ్యాపారికి జీపే ద్వారా నగదు బదిలీకి సంబంధించి ఆధారాలను పోలీసులు చూపించడంతో ఖంగుతిన్నట్లు సమాచారం. సోమవారం రాత్రి శ్రీరామ్‌ను ఎగ్మూరు 14వ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపరచగా, జూలై 7 వరకు పోలీసు కస్టడీకి పంపుతూ మేజిస్ట్రేట్ దయాళన్ ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రేక్షకులకు నచ్చే సినిమాలే చేస్తా

నవీన్ చంద్ర, కామాక్షి భాస్కర్ల జంటగా మదన్ దక్షిణామూర్తి తెరకెక్కించిన చిత్రం 'షోటైం'. అనిల్ సుంకర సమర్పణలో కిషోర్ గరికపాటి నిర్మించారు. జూలై 4న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ 'నాకు తెలిసింది సినిమా ఒక్కటే. కచ్చితంగా ప్రేక్షకులకు నచ్చే సినిమాలనే చేస్తా' అని చెప్పారు. హీరోయిన్ కామాక్షి మాట్లాడుతూ 'చిన్న సినిమానే కానీ, ఇందులో మంచి కంటెంట్ ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు మదన్ దక్షిణామూర్తి



మాట్లాడుతూ 'పరిశ్రమలో ఒక పెద్దాయన ఈ సినిమా చూసి రియల్ షో టైం అని అన్నారు. దాంతో సినిమా ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందనే నమ్మకం కలిగింది' అని అన్నారు. కాగా, ఈ సినిమాలో ఒక హత్య చుట్టూ కథ సాగుతుందని ట్రైలర్‌ని చూస్తే అర్థమవుతోంది.


## ఆగిపోను నేను



సిద్ధార్థ్ కథానాయకుడిగా శ్రీగణేశ్ తెరకెక్కిస్తున్న చిత్రం '3 బీహెచ్‌కే'. శరత్‌కుమార్, యోగిబాబు, దేవయాని కీలక పాత్రలు పోషిస్తున్నారు. అరుణ్ విశ్వ నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన టైటిల్ టీజర్, ఫస్ట్ సింగిల్ ఆకట్టుకున్నాయి. తాజాగా, సెకండ్ సింగిల్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'ఆగిపోను నేను' అంటూ సాగే ఈ పాట మధ్య తరగతి జీవితాల్ని ప్రతిబింబిచేలా ఉంది. దేవా రచించి ఆలపించారు. అమృత్ రామ్‌నాథ్ స్వరపరిచారు. ఈ చిత్రానికి ఎడిటర్: గణేశ్ శివ, సినిమాటోగ్రఫీ: దినేశ్ కృష్ణన్.బి, జితిన్ స్టానిస్లాస్.

## సయారా నుండి వచ్చిన నాలుగో పాట

యశ్ రాజ్ ఫిల్మ్స్ నిర్మాణంలో మోహిత్ సూరి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న సినిమా 'సయారా' అహాన్ పాండే అనీత్ పద్దా జంటగా తెరకెక్కిన ఈ చిత్రం నుంచి ఇప్పటికే మోస్ట్ రొమాంటిక్ సాంగ్స్‌ను మేకర్లు రిలీజ్ చేశారు. 'సయారా' ఆల్బమ్‌లోని నాల్గవ పాట హమ్‌సఫర్‌ను తాజాగా విడుదలైంది.%ఇప్పటివరకు 'సయారా' చిత్రంలోని మూడు పాటలు విడుదల చేయగా అవన్నీ చార్ట్ బస్టర్‌లుగా నిలిచాయి. 'సయారా' టైటిల్ ట్రాక్, జుబిన్ నౌటియాల్ పాడిన 'బర్బాద్' సాంగ్, విశాల్ మిశ్రా ఆలపించిన 'తుమ్ హో తో' పాటలు యూట్యూబ్‌ను షేక్ చేస్తున్నాయి. ఇప్పుడు సంగీత ద్వయం సచెట్ – పరంపర




పాడిన మరో రొమాంటిక్ పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. మోహిత్ సూరి మొదటి సారిగా ఈ సంగీత ద్వయంతో కలిసి పని చేయడం విశేషం. దీంతో ఈ పాట మీద సహజంగానే అంచనాలు పెరిగాయి.

# టుడే స్పోర్ట్స్

## లగ్జరీ అపార్ట్‌మెంట్స్ కొన్న టీమిండియా స్టార్.. ధరెంతో తెలిస్తే షాక్!

టీమిండియా పించ్‌హిట్టర్ శివమ్ దూబె రెండు ఖరీదైన అపార్ట్‌మెంట్స్ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ముంబై వెస్ట్ అంధేరిలోని ఒషివరాలో అతడు అపార్ట్‌మెంట్స్ కొన్నట్లు సమాచారం. వీటి కోసం ఏకంగా రూ.27.50 కోట్లు ఖర్చు చేశాడట చెన్నై సూపర్ కింగ్స్ స్టార్. డీఎల్‌హెచ్ ఎంక్లేవ్‌లోని ఈ అపార్ట్‌మెంట్స్ సైజ్ 4,200 స్క్వేర్ ఫీట్ అని.. బాల్కనీతో కలుపుకొని 9,603 చదరపు అడుగులని తెలుస్తోంది. అపార్ట్‌మెంట్‌తో పాటు 3 పార్కింగ్ స్పేస్‌లను దూబె కొనుగోలు చేశాడట. జూన్ 20న వీటి రిజిస్ట్రేషన్ కూడా పూర్తయిందని.. అందులో భాగంగా స్టాంప్ డ్యూటీతో కలుపుకొని మొత్తం




రూ.1.65 కోట్లు అతడు చెల్లించాడని తెలుస్తోంది.

## వదిలేశారు



లీడ్స్: తమ టెస్టు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారత్ నుంచి ఐదు శతకాలు నమోదైనా ఫలితం లేకపోయింది. తొలి నాలుగు రోజులు భారత్ చేతిలోనే ఉన్న మ్యాచ్‌ను చివరి రోజు ఇంగ్లండ్ అద్భుత బ్యాటింగ్‌తో లాగేసుకుంది. 371 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన స్టోక్స్ సేన 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే ఐదు టెస్టుల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. ఓపెనర్ డకెట్ (170 బంతుల్లో 21 ఫోర్లు, 1 సిక్స్‌తో 149) శతకానికి క్రాలే (65), రూట్ (53 నాటౌట్) అర్ధసెంచరీలు తోడు కావడంతో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 82 ఓవర్లలో 373/5 స్కోరుతో నెగ్గింది. జేమీ స్మిత్ (44 నాటౌట్), స్టోక్స్ (33) సహకారం అందించారు. శార్దూల్, ప్రసిద్ధ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. మంగళవారం ఒక్క రోజే ఆతిథ్య జట్టు తమకు కావాల్సిన 350 పరుగులను రాబట్టడం విశేషం. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 471, రెండో ఇన్నింగ్స్‌లో 364 పరుగులు చేయగా, ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 465 పరుగులు చేసింది. చెమటోడ్చారు..: 21/0 ఓవర్‌నైట్ స్కోరుతో 371 పరుగుల ఛేదన ఆరంభించిన ఇంగ్లండ్ ఓపెనర్లు డకెట్, క్రాలే భారత బౌలర్లను సునాయాసంగా ఎదుర్కొన్నారు. తొలి గంట కాస్తఆచితూచి ఆడినా ఆ తర్వాత చెలరేగారు. ముఖ్యంగా డకెట్ దూకుడుగా కనిపించాడు. పేసర్ బుమ్రా మినహా సిరాజ్, ప్రసిద్ధ్, శార్దూల్ లయను అందుకోలేకపోయారు. అటు ఓపెనర్లు బుమ్రాను జాగ్రత్తగా ఆడేస్తూ మిగతా పేసర్ల ఓవర్లలో బౌండరీలతో స్కోరును పెంచారు. దీంతో తొలి సెషన్‌లో వికెట్ కోల్పోకుండా 96 పరుగులు సాధించింది. %డకెట్ శతకం: లంచ్ బ్రేక్ తర్వాత ఇంగ్లండ్ స్కోరులో మరింత వేగం పెరిగింది. అటు భారత్ సైతం నాలుగు వికెట్లు తీయగలిగింది. డకెట్ చకచకా ఫోర్లు బాదేస్తూ సెంచరీ వైపు సాగాడు. అయితే తను 97 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన క్యాచ్‌ను జైస్వాల్ వదిలేశాడు. ఈ టెస్టులో అతడు క్యాచ్‌లు వదిలేయడం ఇది నాలుగోసారి. ఆ వెంటనే ఫోర్‌తో డకెట్ కెరీర్‌లో ఆరో శతకం పూర్తి చేశాడు. ఇక 41వ ఓవర్ సమయంలో వర్షం వల్ల 20 నిమిషాలపాటు అంతరాయం కలిగింది. ఆ తర్వాత భారత్ ఎదురుచూపులు ఫలించాయి. దాదాపు మూడు సెషన్ల పాటు విసిగించిన ఓపెనింగ్ జోడీని పేసర్ ప్రసిద్ధ్ విడదీశాడు. చక్కటి అవుట్ స్వింగర్‌తో క్రాలేను అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 188 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. ప్రసిద్ధ్ తన తర్వాతి ఓవర్‌లోనే పోప్ (8)ను బౌల్డ్ చేసి రిలీఫ్‌నిచ్చాడు. అటు డకెట్ మాత్రం ఎదురుదాడి సాగిస్తూ ప్రసిద్ధ్ ఓవర్‌లో రెండు ఫోర్లు, జడేజా ఓవర్‌లో సిక్సర్‌తో ధాటిని చూపాడు. కానీ 55వ ఓవర్‌లో డకెట్, బ్రూక్ (0)లను వరుస బంతుల్లో వెనక్కి పంపిన శార్దూల్ గట్టి ఝలక్ ఇచ్చాడు. 59వ ఓవర్‌లో వర్షం రెండోసారి అంతరాయం కలిగించడంతో అంపైర్లు టీ బ్రేక్‌ను ప్రకటించారు. అప్పటికి ఇంగ్లండ్ విజయానికి 102 పరుగుల దూరంలో ఉంది.

## గోల్డెన్ స్పైక్ విజేత చోప్రా



ఒస్ట్రావా (చెక్ రిపబ్లిక్): డైమండ్ లీగ్ నెగ్గిన జోరుమీదున్న వరల్డ్ చాంపియన్ నీరజ్ చోప్రా వరుసగా రెండో టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు. మంగళవారం జరిగిన ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్ ఈవెంట్‌లో జావెలిన్‌ను మూడో త్రోలో 85.29 మీటర్ల దూరం విసిరిన నీరజ్ అగ్రస్థానంలో నిలిచాడు. ఈ టైటిల్ నెగ్గడం చోప్రాకిదే తొలిసారి. మొత్తం 9 మంది టాప్ అథ్లెట్లు పోటీపడ్డ ఈ మెగా ఈవెంట్‌లో దక్షిణాఫ్రికా త్రోయర్ డౌ స్మిత్ (84.12 మీ.) రెండో స్థానంలో, గ్రెనడాకు చెందిన అండర్సన్ పీటర్స్ (83.63 మీ.) మూడో స్థానంలో నిలిచారు.

## ఒలింపిక్ స్వర్ణానికి రూ 6 కోట్లు



తెలంగాణ ప్రభుత్వ కొత్త క్రీడా పాలసీలో నగదు ప్రోత్సాహకాలను భారీగా పెంచారు. గతంలో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధిస్తే ఇచ్చే రూ.2 కోట్లను తాజా పాలసీలో రూ.6 కోట్లకు, ఆసియా క్రీడల్లో పసిడి పతకం గెలిస్తే ఇచ్చే రూ.30 లక్షలను రూ.3 కోట్లకు గణనీయంగా పెంచారు. ఇకపై ఒలింపిక్స్‌లో రజతానికి రూ.4 కోట్లు, కాంస్యానికి రూ.2 కోట్లు, ఆసియా క్రీడల్లో రజతానికి రూ. కోటిన్నర, కాంస్యానికి రూ.75 లక్షలు ఇవ్వనున్నారు. కామన్వెల్త్ క్రీడలకు గతంలో స్వర్ణానికి రూ.25 లక్షలు ఉండగా, తాజాగా రూ. కోటిన్నరకు పెంచారు. రజతానికి రూ.75 లక్షలు, కాంస్యానికి రూ.50 లక్షలు అందిస్తారు. సాధారణ క్రీడాకారులతో సమానంగా ఎలాంటి వ్యత్యాసం లేకుండా పారా అథ్లెట్లకు కూడా ఇవే నగదు బహుమతులను అందించనున్నామని శాట్ చైర్మన్ శివసేనారెడ్డి చెప్పారు. అంతర్జాతీయ పోటీల్లో నిలకడగా రాణిస్తున్న క్రీడాకారులను గుర్తించి వారికి ప్రత్యేకంగా ఆర్థిక, శిక్షణ పరంగా సహాయం అందించేందుకు కాంపిటేటివ్ అండ్ హైపెర్ఫామెన్స్ స్పోర్ట్స్ బోర్డును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

## దిలీప్ దోషి మృతికి నివాళిగా



భారత మాజీ స్పిన్నర్, 77 ఏళ్ల దిలీప్ దోషి గుండెపోటుతో లండన్‌లో కన్నుమూశాడు. దీంతో మంగళవారం చివరి రోజు ఆట ఆరంభానికి ముందు ఇరు జట్ల ఆటగాళ్లు నిమిషం పాటు మౌనం పాటించడంతో పాటు తమ చేతులకు నల్ల బ్యాడ్జీలు ధరించారు. 1970 దశకంలో మేటి స్పిన్నర్‌గా కొనసాగిన దోషి 33 టెస్టుల్లో 114 వికెట్లు, అలాగే 15 వన్డేల్లో 22 వికెట్లు తీశాడు. మరోవైపు ఇదివరకే టెస్టు తొలి రోజు అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు, ఆ తర్వాత ఇంగ్లండ్ మాజీ పేసర్ డేవిడ్ వాలెంటైన్ మృతికి నివాళిగా రెండు పర్యాయాలు జట్లు నల్ల బ్యాడ్జీలు ధరించిన విషయం తెలిసిందే.

## గిల్ సేనను భయపెడుతున్న పేస్ పిచ్చోడు.. ఎంట్రీ ఇస్తే దబిడిదిబిడే!

ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత జట్టుకు ఒక బ్యాడ్ న్యూస్. మన టీమ్ బ్యాటర్లను కంట్రోల్ చేసేందుకు ఓ పేస్ పిచ్చోడ్ని బరిలోకి దింపుతోంది ఇంగ్లీష్ టీమ్. ఆ పేస్ రాక్షసుడు మరెవరో కాదు.. జోఫ్రా ఆర్చర్. అవును, ఆర్చర్ వచ్చేస్తున్నాడు. అదేంటి ఫిట్‌నెస్ సమస్యలతో తడబడే ఈ బౌలర్.. టెస్టులు ఆడటం ఏంటనేగా మీ సందేహం. అయితే గాయాల నుంచి కోలుకున్న ఆర్చర్.. కొన్నాళ్లుగా ఫిట్‌నెస్‌ను మెరుగుపర్చుకోవడం మీద పని చేశాడు. ఈ క్రమంలోనే ఇటీవల ఇంగ్లండ్ దేశవాళీ టోర్నమెంట్ అయిన కౌంటీ చాంపియన్‌షిప్ డివిజన్ మ్యాచుల్లో పాల్గొన్నాడు.టెస్టులకు 2021 ఫిబ్రవరి నుంచి దూరంగా ఉంటున్నాడు జోఫ్రా ఆర్చర్. కేవలం వన్డేలు, టీ20ల్లోనే ఆడుతూ వస్తున్నాడీ పేసర్. గాయాల బెడద కారణంగా లిమిటెడ్ ఓవర్స్ క్రికెట్‌లోనూ పూర్తి మేర అందుబాటులో ఉండటం లేదు. అలాంటోడు ఇప్పుడు ఫుల్‌గా రికవర్ అయ్యాడు. అందుకే 1,501 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత ఇటీవల కౌంటీ బరిలోకి




దిగి రెడ్ బాల్‌తో బౌలింగ్ చేశాడు. అతడి ఫిట్‌నెస్ మెరుగుపడటం, రెడ్ బాల్‌తో ప్రభావవంతంగా బౌలింగ్ చేస్తుండటంతో భారత్-ఇంగ్లండ్ సిరీస్‌లో బరిలోకి దించాలని సెలెక్టర్లు భావిస్తున్నారట. అదే జరిగితే గిల్ సేనకు ఆర్చర్‌కు మధ్య భీకర యుద్ధం తప్పదని విశ్లేషకులు అంటున్నారు. ఇంగ్లీష్ కండీషన్స్‌లో అతడి యార్కర్లు, బౌన్సర్లు, స్వింగర్లను తట్టుకొని మన బ్యాటర్లు నిలబడటం కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరి.. ఆర్చర్ ఏ టెస్ట్‌లో రీఎంట్రీ ఇస్తాడో చూడాలి.

## పంత్ ఖాతాలో డీమెరిట్ పాయింట్



మూడో రోజు ఆటలో అంపైర్ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేసినందుకు వికెట్ కీపర్ పంత్ ఐసీసీ మందలింపునకు గురయ్యాడు. అలాగే అతడి ఖాతాలో ఓ డీమెరిట్ పాయింట్‌ను కూడా చేర్చారు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ సమయంలో బంతిని మార్చాలని పంత్ అంపైర్ పాల్ రీఫిల్‌ను కోరగా అందుకు తను నిరాకరించాడు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన పంత్ ఆ బంతిని నేలకేసి కొట్టడంతో ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ లెవెల్ 1ను అతిక్రమించినట్టయ్యింది.

# టుడే బిజినెస్

## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు





బంగారం, వెండి ప్రియులకు గుడ్ న్యూస్ వచ్చేసింది. వీటి ధరలు  నిన్నటితో పోల్చితే ఒక్కసారిగా తగ్గిపోయాయి. ఈ క్రమంలో గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం జూన్ 25, 2025న ఉదయం 6.30 గంటల నాటికి బంగారం ధరలు రూ.1620 పడిపోయాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 99,210కు చేరుకుంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 90,940కి చేరింది. ఇదే సమయంలో దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 99,360కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 91,010 స్థాయికి చేరింది.

## మన దిగుమతి సుంకాలు తక్కువే



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మన దేశాన్ని పదే పదే సుంకాల రారాజుగా అభివర్ణించడాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రంగా తప్పు పట్టారు. మన దిగుమతి సుంకాలు ఆసియాన్ దేశాలతో సమానం గా సగటున 10.66 శాతం మాత్రమే ఉన్నాయన్నారు. అమలుకు వచ్చే సరికి ఈ రేట్లు ఇంకా తక్కువగా ఉన్నట్టు తెలిపారు. ఇండియా ఎగ్జిమ్ బ్యాంకు నిర్వహించిన ఒక సదస్సులో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టీఏ) కోసం అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ) కూటమితో జరుగుతున్న చర్చలు త్వరలోనే ఒక కొలిక్కి వస్తాయని ఆమె చెప్పారు. ప్రస్తుతం ఇందుకోసం ఈ దేశాలతో జరుగుతున్న చర్చలు సజావుగానే జరుగుతున్నాయన్నారు.

## వొడాఫోన్ సైయెంట్ సహకార భాగస్వామ్యం




హైదరాబాద్ : నెట్‌వర్క్ ఇంజనీరింగ్, ఆపరేషన్ విభాగాల్లో సమర్థతను పెంచేందుకు వొడాఫోన్, సైయెంట్ చేతులు కలిపాయి. దీని కింద ఉభయ సంస్థలు ఏఐ ఆధారంగా పని చేసే గ్లోబల్ నెట్‌వర్క్ కన్ఫిగరేషన్ సొల్యూషన్‌ను విడుదల చేశాయి. దీని వల్ల స్థానిక మార్కెట్లలో నెట్‌వర్క్ మేనేజ్‌మెంట్ సమర్థత పెరుగుతుందని వొడాఫోన్ తెలిపింది.

## ఐదేళ్లలో రూ 8 60 లక్షల కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ వ్యాపారాల భవిష్యత్ వృద్ధి కోసం వచ్చే ఐదేళ్లలో 10,000 కోట్ల డాలర్ల (రూ.8.60 లక్షల కోట్లు)వరకు పెట్టుబడులు పెట్టనుంది. ఏటా 1,500- 2,000 కోట్ల డాలర్ల (రూ.1.29-1.72 లక్ష ల కోట్లు) చొప్పున ఇన్వెస్ట్ చేయనున్నట్లు గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ మంగళవారం దృశ్య మాధ్యమ విధానంలో నిర్వహించిన గ్రూప్ షేర్‌హోల్డర్ల వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన వెల్లడించారు.

గత ఆర్థిక సంవత్సరం అదానీ గ్రూప్ ఏకీకృత ఆదాయం వార్షిక ప్రాతిపదికన 7 శాతం వృద్ధితో రూ.2,71,664 కోట్లకు పెరగగా.. ఎబిటా 8.2 శాతం వృద్ధితో రూ.89,806 కోట్లుగా నమోదైంది. ఈ రికార్డు రాబడులను వ్యాపారాల విస్తరణకు ఉపయోగిస్తాం.

అదానీ గ్రీన్ ఎనర్జీ ప్రపంచంలోనే అతిపెద్ద పునరుత్పాదక ఇంధన పార్క్‌ను నిర్మిస్తోంది. ఇది అంతరిక్షంలో నుంచి చూసినా కనిపించేంత పెద్దది. 2030 నాటికి మొత్తం 100 గిగావాట్ల థర్మల్, రెన్యువబుల్, జల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం.

నవీ ముంబై ఎయిర్‌పోర్ట్‌ను ఈ ఏడాదిలోనే ప్రారంభమవుతుంది. తొలుత 2 కోట్ల వార్షిక ప్రయాణికుల సామర్థ్యంలో కార్యకలాపాలను ప్రారంభిస్తాం. సామర్థ్యాన్ని క్రమంగా 9 కోట్లకు పెంచుతాం.

**ఆపరేషన్ సిందూర్‌లో మా డ్రోన్లది కీలకపాత్ర**

తమ గ్రూప్ తయారు చేసిన డ్రోన్లు, యాంటీ-డ్రోన్ వ్యవస్థలు ఆపరేషన్ సిందూర్‌లో ముఖ్య భూమికను పోషించాయని అదానీ పేర్కొన్నారు. అదానీ డిఫెన్స్ ఉత్పత్తి చేసిన మందుగుండు సామాగ్రి పాకిస్థాన్‌లోని లక్ష్యాలపై ఖచ్చితమైన దాడులకు ఉపయోగపడగా.. కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్ పాకిస్థాన్ దాడుల నుంచి మన ఆస్తులను రక్షించేందుకు దోహదపడ్డాయన్నారు. మా డ్రోన్లు భారత్‌కు ఆకాశంలో నిఘా నేత్రాలుగా, దాడి కత్తుల్లా పనిచేశాయని.. యాంటీ డ్రోన్ సిస్టమ్స్ మన రక్షణ దళాలతోపాటు పౌరులను కాపాడేందుకు తోడ్పడ్డాయన్నారు.

**ముంబై ఎయిర్‌పోర్ట్ కోసం రూ.8,600 కోట్ల సమీకరణ**

ముంబై విమానాశ్రయం కోసం అదానీ గ్రూప్ 100 కోట్ల డాలర్ల (సుమారు రూ.8,600 కోట్లు) నిధులు సమీకరించింది. ఈ ఎయిర్‌పోర్టు 2022లో తీసుకున్న రుణాల రీఫైనాన్సింగ్ కోసం అమెరికా చెందిన అపోలో గ్లోబల్ మేనేజ్‌మెంట్ సహా పలు అంతర్జాతీయ ఇన్వెస్టర్ల నుంచి ఈ నిధులను సేకరించింది.

## వడ్డీరేట్ల తగ్గింపుపై వేచి చూస్తాం



వాషింగ్టన్: అధ్యక్షుడు ట్రంప్ ఎంత అరిచి గీపెట్టినా కీలక వడ్డీరేట్లను ఇప్పటికిపుడు త గ్గించే ప్రసక్తే లేదని అమెరికన్ ఫెడరల్ రిజ ర్వ్ తేల్చి చెప్పింది. ఆర్థిక వ్యవస్థలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయో వేచి చూసి మాత్రమే, వడ్డీరేట్ల తగ్గింపుపై నిర్ణయం తీసుకుంటామని ఫెడ్ చైర్మన్ జెరోం పోవెల్ స్పష్టం చేశారు. రుణ సేకరణ భారం తగ్గించేందుకు ఫెడ్ వెంటనే వడ్డీరేట్లు తగ్గించాలని ట్రంప్ పదే పదే కోరుతున్న విషయం తెలిసిందే. అయినా గత వారం జరిగిన సమావేశంలో కీలక స్వల్ప కాలిక వడ్డీరేట్లను 4.25-4.5 శాతం వద్దే కొనసాగించాలని ఫెడ్ నిర్ణయించింది. దీనిపె ్టంప్ మండిపడుతూ పోవెల్‌ను మూర? శిఖామణి, అసమర్థుడు అని నిందించారు.

## అతి తక్కువ వడ్డీతో హెూం లోన్స్ కావాలా? అయితే ఈ బ్యాంక్‌లు అందించే ఆఫర్లు తెలుసుకోండి..




నేటి కాలంలో ప్రతి ఒక్కరూ సొంత ఇల్లు కలిగి ఉండాలని కలలు కంటారు. కానీ భూమి, ఇతర ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా మెట్రో నగరాల్లో పని చేసే వ్యక్తులు తమ సంపాదనతో ఇల్లు కొనడం పెద్ద సవాలు. అటువంటి పరిస్థితిలో చాలా మంది గృహ రుణాలను ఆశ్రయిస్తారు. దేశంలోని వివిధ బ్యాంకులు వేర్వేరు వడ్డీ రేట్లకు గృహ రుణాలను అందిస్తాయి కానీ మీరు తక్కువ వడ్డీ రేటుకు రుణం తీసుకోవాలనుకుంటే, ప్రభుత్వ బ్యాంకులు మీకు మంచి ఎంపిక కావచ్చు. ఈ రోజు మనం 7.50 శాతం కంటే తక్కువ వడ్డీ రేటుకు గృహ రుణాలు ఇస్తున్న కొన్ని ప్రభుత్వ బ్యాంకుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

**బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర**

మీరు అతి తక్కువ వడ్డీ రేటుకు గృహ రుణం కోసం చూస్తున్నట్లయితే, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మీకు మంచి ఎంపిక. ఈ బ్యాంకులో గృహ రుణం ప్రారంభ వడ్డీ రేటు కేవలం 7.35 శాతం మాత్రమే. అయితే, ఈ రేటు మీ రుణ మొత్తం, రుణ కాలపరిమితి, మీ %జ×దీ×ూ% స్కోరుపై ఆధారపడి ఉంటుంది. మీ %జ×దీ×ూ% స్కోరు బాగుంటే, మీరు ఇంకా తక్కువ వడ్డీ రేటు పొందవచ్చు. దీనితో పాటు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ప్రాసెసింగ్ ఫీజు కూడా చాలా తక్కువ. ఇది 0.25 శాతం నుండి ప్రారంభమవుతుంది, ఇది లోన్ మొత్తాన్ని బట్టి కొంచెం ఎక్కువగా ఉ ండవచ్చు. మీరు తక్కువ నెలవారీ %జువీ×%, తక్కువ వడ్డీ రేటుతో లోన్ కోరుకుంటే, మీరు ఈ బ్యాంకును సంప్రదించవచ్చు.

## ఇండిగో అదిరిపోయే ఆఫర్.. కేవలం రూ.1,499కే విమాన టికెట్




ఆసియాలోని అతిపెద్ద విమానయాన సంస్థల్లో ఒకటైన ఇండిగో మంగళవారం తన వార్షిక "మాన్‌సూన్ సేల్"ను ప్రకటించింది. దేశీయ విమాన టిక్కెట్ల ధర రూ.1,499. అంతర్జాతీయ విమాన టిక్కెట్ల ధర రూ.4,399. ఈ పరిమిత కాల అమ్మకం ఇండిగో దేశీయ, అంతర్జాతీయ విమానాలలో ప్రయాణించే ప్రయాణికులు ఎంచుకున్న వివిధ రకాల యాడ్-ఆన్‌లపై ప్రత్యేక తగ్గింపులను కూడా అందిస్తుంది. ఈ సంవత్సరం జూలై 1 %-% సెప్టెంబర్ 21 మధ్య ప్రయాణానికి జూన్ 24 %-% జూన్ 29 మధ్య చేసిన బుకింగ్‌లకు ఈ ఆఫర్ చెల్లుబాటు అవుతుంది.ఈ సేల్ ప్రారంభమయ్యే వరకు కస్టమర్లు అన్నీ కలిసిన వన్-వే దేశీయ విమానాలను రూ.1,499 నుండి ప్రారంభ ధరలతో, అంతర్జాతీయ విమానాలను రూ.4,399 నుండి ప్రారంభ ధరలతో బుక్ చేసుకోవచ్చు. అదనపు సౌకర్యం, అదనపు లెగ్‌రూమ్ కోసం ప్రయాణికులు బుకింగ్ సమయంలో ఇండిగోస్ట్రెచ్ సదుపాయాన్ని ఎంచుకోవచ్చు. ఛార్జీలు రూ.9,999 నుండి ప్రారంభమవుతాయి. ప్రయాణికులు తగ్గింపు ధరకు విమానాలను ఎంచుకోవడంతో పాటు 50 శాతం వరకు తగ్గింపుతో యాడ్-ఆన్ సేవలను కూడా పొందవచ్చు. దేశీయ విమానాలకు ప్రీ-పెయిడ్ అదనపు సామానుపై ప్రయాణికులు ఇప్పుడు 50 శాతం వరకు తగ్గింపును పొందవచ్చు. అంతర్జాతీయ విమానాలకు 15 కిలోలు, 20 కిలోలు, 30 కిలోల బ్యాగ్ అలవెన్సులపై కూడా తగ్గింపును పొందవచ్చు. ఎంపిక చేసిన దేశీయ, అంతర్జాతీయ విమానాలలో ప్రాధాన్యత చెక్-ఇన్, ఎప్పుడైనా బోర్డింగ్‌తో సహా "ఫాస్ట్ ఫార్వర్డ్" సేవపై ఇండిగో 50 శాతం వరకు తగ్గింపును కూడా అందిస్తోంది.ఇంతలో, ఎంపిక చేసిన దేశీయ, అంతర్జాతీయ విమానాలలో ప్రామాణిక సీట్ల ఎంపిక రూ.99 వరకు తక్కువ ధరలకు అందుబాటులో ఉ ంది. దేశీయ విమానాలలో అత్యవసర %శూ% (ఎక్స్‌ట్రా లెగ్‌రూమ్) సీట్లు రూ.500 నుండి ప్రారంభ ధరలకు అందుబాటులో ఉన్నాయి.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006